## క్లుప్తంగా

### పంచాయతీ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

**ముస్తాబాద్:** మేజర్ పంచాయతీలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలేదని పంచాయతీ ఆవరణలోని గాంధీ విగ్రహం ఎదుట బీజేపీ నాయకులు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు మెంగని మహేందర్ మాట్లాడుతూ సర్పంచ్ సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న భవనంపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్‌కు, డీపీవోకు ఫిర్యాదు చేశామన్నారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ప్యాక్స్ డైరెక్టర్లు గిరిధర్‌రెడ్డి, దేవేందర్, నాయకులు సంజీవ్, అంజాగౌడ్, శ్రీనివాస్‌రావు, కల్యాణ్, ఉపేంద్ర, మల్లేశ్ పాల్గొన్నారు.

### రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

**వేములవాడఅర్బన్:** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్మికులు, అవుట్ సోర్సింగ్ వర్కర్ యూనియన్ మూడో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు అన్నారు. వేములవాడ మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాదులో జూన్ 6, 7 తేదీల్లో జరిగే ఈ సభలకు పెద్ద ఎత్తున కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సి పల్ కార్మిక సంఘం నాయకులు నర్సయ్య, శ్రీనివాస్, రమేశ్, క్రాంతి పాల్గొన్నారు.

### 'వైద్యశాల పనితీరుపై అసంతృప్తి'

**ముస్తాబాద్:** మండల కేంద్రంలోని బీడీ కార్మికులకు కేంద్ర కార్మిక సంచార వైద్యశాల సేవలపై ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం వైద్యశాలను ప్రజాప్రతినిధులు సందర్శించిన సమయంలో వైద్యాధికారి విక్రమ్‌కుమార్ విధుల్లో లేరు. సెలవులో ఉన్నట్లు ఫార్మసిస్ట్ తెలిపారు. అనంతరం రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు మాట్లాడుతూ మహిళలు, ఇతర కార్మికులు ఇబ్బందులు పడుతున్నా ఆసుపత్రిలో సేవలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. స్టాఫ్‌నర్స్ పోస్టు ఖాళీగా ఉందని, అంబులెన్స్ లేదన్నారు. హాజరు రిజిష్టర్‌లో ఈనెల 11 నుంచి వైద్యాధికారి సంతకాలు లేవన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజయ్య, చెవుల మల్లేశ్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు

# ఇరుకు గదుల్లో విధులు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, సిబ్బంది, అధికారులు
- ఉద్యోగులకు గదులు కరువు
- ఒకే గదిలో పలువురు ఉద్యోగుల విధులు
- ఇది తహసీల్దార్ కార్యాలయం పరిస్థితి



బోయినపల్లి తహసీల్దార్ కార్యాలయం



ఇరుకుగా కార్యాలయ వరండా



డిప్యూటీ తహసీల్దార్ గది

**బోయినపల్లి:** బోయినపల్లి తహసీల్దార్ కార్యాలయం ఇరుకుగా ఉండదంతో అటు ఉద్యోగులు, ఇటు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలోని డీటీ గదిలో పది మంది వస్తే ఒకరికి ఒకరు తగిలే పరిస్థితి ఉందంటే, గదులు ఎంత ఇరుకుగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. రెవెన్యూ భూసంబంధిత సమస్యలు, 1–బీలు, పహణీ నఖళ్లు, మ్యుటేషన్లు, నాలా కన్వర్షన్లు, రేషన్ సంబంధిత అంశాలు, ఇతర భూసేకరణ విషయాలు ఇలా అనేక రకాల పనులపై ప్రతిరోజూ తహసీల్దార్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తారు. ఈ పనులకు తోడు ఇటీవలి కాలంలో భూముల రిజిస్ట్రేషన్లు సైతం తహసీల్దార్ కార్యాలయంలో చేస్తుండదంతో జనం తాకిడి మరీ ఎక్కువైంది.

### నాలుగు గదులు.. ఒక వరండా..

ఈ కార్యాలయ భవనాన్ని రూ.17.25 లక్షల అంచనా వ్యయంతో నిర్మించి 2012 మార్చి 24న ప్రారంభించారు. సుమారు 12 ఏళ్ల కింద నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సరిపోవడం లేదు. గదులన్నీ చిన్నగా ఉన్నాయి. కార్యాలయంలో కేవలం నాలుగు గదులు ఒక వరండా మాత్రమే ఉంది. ఇందులో ఒకటి తహసీల్దార్ గది, మరో గదిలో డిప్యూటీ తహసీల్దార్ ఇతర ఉద్యోగుల గది. మరో గది ధరణి ఆపరేటర్, ఇంకో గది రికార్డు రూం. డీటీ గదిలో డీటీతో పాటు ఇద్దరు ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, ఏఎస్‌వో తదితర ఆఫీసు స్టాఫ్ విధులు నిర్వహిస్తారు. ఈ గదిలో ఒక్కో ఉద్యోగికి ఒక గదిలా కార్డుబోర్డులతో నిర్మించారు. కక్రతో చిన్న రూమ్‌లా ఏర్పాటు చేసిన ఆ గదుల్లో సుమారు పది మంది వరకు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇదే గదిలో వీఆర్ఏలు సైతం తమ విధులు అప్పుడప్పుడు చేస్తుంటారు. ఈ గదిలో పనులపై వచ్చిన వారు కనీసం పది మంది సైతం నిల్చుండే వీలు లేదు. మరో గదిలో రిజిస్ట్రేషన్ సంబంధిత ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నారు. ముందు ఉన్న ఒక చిన్న వరండా ముందు రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారు, తహసీల్దార్‌ను కలిసేందుకు వచ్చిన వారు వేచి ఉంటారు. కార్యాలయంపై గతంలో వీఆర్వోలు ఉన్నపుడు తాత్కాలికంగా రేకులతో గది ఏర్పాటు చేశారు. ఎండకాలంలో అక్కడ విధులు నిర్వహించడం అంత సులువు కాదు.

### భద్రత లేని రికార్డు గది

తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు గది భద్రతతో అత్యంగా గోప్యంగా ఉంచాల్సిన గది. ఇక్కడ గదుల కొరతతో స్థానికంగా ఉన్న రికార్డు గదిలో సైతం ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం మండల సర్వేయర్ రికార్డ్ గదిలోనే విధులు నిర్వహిస్తుండడం గమనార్హం. కాగా తహసీల్దార్ నరేశ్ కార్యాలయం విస్తరించే పనులు చేసే యోచనలో ఉన్నట్లు తెలిపారు.

### ఇబ్బంది పడుతున్నాం



తహసీల్దార్ కార్యాలయానికి నిత్యం పలు పనులపై ప్రజలు వస్తుంటారు. రిజిస్ట్రేషన్లు కూడా చేస్తుండడంతో పలు గ్రామాల ప్రజలు వస్తున్నారు. గదులు ఇరుకుగా ఉండడం ప్రజలు, అధికారులు ఇబ్బంది పడుతున్నారు.

– నిమ్మ శ్రీనివాసరెడ్డి, దేశాయిపల్లి

### విస్తరణ పనులు చేపట్టాలి



ఏళ్ల కింద నిర్మించిన భవనంతో ఇరుకుగా ఉంది. కార్యాలయంలోని గదులు ఇరుకుగా ఉండడంతో ఒకరికి ఒకరు తగిలే పరిస్థితి ఉంది. కార్యాలయంలో గదుల విస్తరణ పనులు చేపట్టాలి.

– నల్లగొండ అనీల్, బోయినపల్లి

### పనులు చేపడతాం



తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు అన్ని రకాల రెవెన్యూ సేవలు అందిస్తున్నాం. కార్యాలయ భవనం గదులు విస్తరించే పనులు చేపట్టాలని అనుకుంటున్నాం. త్వరలో భవనం విస్తరించే పనులు చేపడతాం.

– దర్పెల్లి నరేశ్, తహసీల్దార్, బోయినపల్లి

## పవర్ కట్

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

**తంగళ్లపల్లి:** మండలంలోని లక్ష్మీపూర్ పరిధిలోని 33 కేవి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు కారణంగా గురువారం లక్ష్మీపూర్, అంకుషాపూర్, పాపయ్యపల్లె గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### అ'పూర్వ' సమ్మేళనం



**వేములవాడరూరల్:** 25 ఏళ్ల క్రితం కలిసి చదుకున్న స్నేహితులు నేడు కలిసి నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. వేములవాడ మండలంలోని వట్టెంలలో 1998–99 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానం చేశారు. గురువులు భగవాన్‌రెడ్డి, దేవరెడ్డి, వెంకటరమణారెడ్డి, రాజిరెడ్డి, మురళీకృష్ణ, అనంతరెడ్డి పాల్గొన్నారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత



**ముస్తాబాద్:** ముస్తాబాద్ నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని బుధవారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై మారుతి తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా, పక్కా సమాచారం మేరకు ముస్తాబాద్ నుంచి నామాపూర్‌లోని ఓ రైస్‌మిల్లుకు ట్రాలీ ఆటోలో 7 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. మరో రెండు వాహనాలు తప్పించుకున్నట్లు తెలిపారు.సీఎంఆర్ బియ్యం లోడుతో వెళ్తున్న డీసీఎం వ్యాన్‌ను తనిఖీ చేసి, ఈచలాన్, వేబిల్లుపై ఉన్న అనుమానంతో ఠాణాలో అప్పగించామన్నారు.

### రోడ్డు ప్రమాదఘటనపై ఎంవీఐ విచారణ

**ముస్తాబాద్:** మండలం నామాపూర్, గూడెం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదం సంఘటనపై ఎంవీఐ శరత్‌చంద్రారెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. లారీ, బైక్ ఢీకొట్టిన ఘటనలో బైక్‌పై వున్న సిద్దిపేట జిల్లాకు చెందిన రుచిత బీటెక్ విద్యార్థినీ దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఇదే ఘటనలో గూడెంకు చెందిన వంశీ, బంజేరుపల్లికి చెందిన సుహిత గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఏఎస్సై వెంకటరమణ ఉన్నారు.

### వేధింపులకు పాల్పడుతున్న భర్తపై కేసు

**సిరిసిల్లక్రైం:** మద్యానికి బానిసై ఏ పని చేయకుండా తనను శారీరంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్న భార్య ఇచ్చిన ఫిర్యాదుతో భర్తపై సిరిసిల్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన నాయక్ తెలిపారు. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన వేలుముల నాగేందర్‌రెడ్డి ఏ పనికి వెళ్లక, తాగుడు బానిసగా మారి, తాగేందుకు డబ్బులు కావాలని వేధిస్తున్నాడని, మంగళవారం రాత్రి తాగొచ్చి ఇబ్బంది గురిచేయడంతో భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై..

**సిరిసిల్లక్రైం:** ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై సిరిసిల్ల పోలీసులు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల 15న కరీంనగర్‌కు చెందిన బండి శాంతికిరణ్ రగుడు సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బండారి రాజమౌళి ఢీకొట్టాడు. బాధితుడి కుమారుడు రఘువరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శాంతికిరణ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### మిషన్ భగీరథ నీటికి బిల్లు వసూలు

**వేములవాడఅర్బన్:** రాష్ట్రమంతా మిషన్ భగీరథ నీరు ఉచితంగా అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతుంటే వేములవాడ మున్సిపల్ మాత్రం నెలకు రూ.100 బిల్ వసూలు చేస్తోందని 20వ వార్డు కౌన్సిలర్ రేగుల సంతోష్‌బాబు ఒక ప్రకటనలో ఆరోపించారు.

## కంపోస్టు షెడ్డు పనుల అడ్డగింత



ఆందోళన చేస్తున్న దళిత నాయకులు

**ముస్తాబాద్:** పట్టణ శివారులో అంబేద్కర్‌నగర్‌ను అనుకొని చేపట్టిన మండల కంపోస్టు షెడ్డు పనులను తక్షణమే నిలిపివేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. డంపుయార్డులో జరుగుతున్న పనులను బుధవారం దళితులు అడ్డుకుని మాట్లాడారు. కొన్నేళ్లుగా ఎస్సీ, వడ్డెర కాలనీలను అనుకుని వున్న డంపుయార్డుతో అనేక రోగాలకు గురవుతున్నామని ఐదేళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నా డంపుయార్డును తరలించకుండా, మండల స్థాయిలో ప్లాస్టిక్ వస్తువుల డంపింగ్ కోసం షెడ్డును నిర్మించడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే శ్మశాన వాటిక, రత్నాలకుంటతో ఎస్సీ కాలనీలో ప్రజలు ఉండలేకపోతున్నారని, ఇప్పుడు మండలంలోని అన్ని గ్రామాలకు ముస్తాబాద్‌లోనే డంపింగ్ షెడ్డు నిర్మించడం అన్యాయమన్నారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో రమాదేవి అక్కడికి చేరుకున్నారు. షెడ్డుతో ఎలాంటి ఇబ్బందులు వుండవని తెలిపినా, ఎంపీడీవోతో వాగ్వాదానికి దిగారు. ప్రస్తుతం ఉన్న డంపింగ్‌తోనే ఇళ్లలో ఉండే పరిస్థితులు లేవన్నారు. కొత్తగా మండల ప్రజలందరి కోసం నిర్మించే షెడ్డుతో తాము మరింత రోగాలకు గురవుతామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను చెరువు కింద డంపింగ్ యార్డును నిర్మించవద్దని స్పష్టం చేశారు. చెరువు కింద పిల్లల పార్కును నిర్మించాలని కోరారు. మండలంలో మరోచోట మండల డంపింగ్ యార్డు నిర్మించాలని సూచించారు. అంబేద్కర్ సంఘం జిల్లా కార్యదర్శి సుంచు మల్లయ్య, మీస శంకర్, ముక్క మల్లయ్య, దుబ్బాక రాజు, నల్లబాబు, చంద్రం, గుండురావు, గుండెల్లి దేవరాములు, తదితరులు పాల్గొన్నారు.

## నందికమాన్‌కు 50 ఏళ్లు



నందీ కమాన్ ప్రారంభోత్సవంలో..



నేడు నందీ కమాన్

**వేములవాడఅర్బన్:** వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు స్వాగతం పలికే నందికమాన్‌కు 50 ఏళ్లు. 1971 ఫిబ్రవరిలో అప్పటి చైర్మన్ వెంకటేశ్వర్‌రావు నందికమాన్ పనులు ప్రారంభించి 1973 మార్చికి పూర్తి చేసి ప్రారంభించారు. దీని నిర్మాణానికి దంగుసున్నం వాడారు. ఆ తర్వాత వేములవాడ పట్టణం చుట్టూ కమాన్‌లు ఏర్పాటు చేశారు. బస్టాండ్ సమీపంలో జగిత్యాల, కోరుట్ల, నాంపల్లి, సిద్దిపేట వెళ్లే రూట్‌లలో కమాన్‌లు కనిపిస్తాయి. రాజన్న ఆలయం వైపు ముఖం ఉండేలా నంది విగ్రహాన్ని 1995లో అప్పటి ఆలయ చైర్మన్ కమలాకర్‌రావు ఏర్పాటు చేయించారు. అప్పటి నుంచి కమాన్‌ను నందికమాన్ అని పిలుస్తున్నారు. వేములవాడ, సిరిసిల్ల, కరీంనగర్ రహదారుల మధ్య జంక్షన్ సుందరీకరణలో భాగంగా రూ.87 లక్షలతో గార్డెన్ పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయితే ఆహ్లాదకరంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు.

### కంటి వెలుగు ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**సిరిసిల్లఅర్బన్:** మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ బుధవారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు, రైతు బంధు మండలాధ్యక్షుడు రాములు, పెద్దూరు సింగిల్‌విండో చైర్మన్ జీలకిషన్, నాయకులు పాల్గొన్నారు.

**ఇల్లంతకుంట:** మండలంలోని పొత్తూరు, హవెల్లిపూర్ గ్రామాల్లో సర్పంచులు శ్రీనివాస్, రజిత, ఎంపీటీసీ అశ్విని, వైద్యాధికారి రమేశ్ ప్రారంభించారు.

**ముస్తాబాద్:** మండలంలో గూడూరులో కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ గుండం నర్సయ్య ప్రారంభించారు. సర్పంచ్ చాకలి రమేశ్, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, ఎంపీటీసీ కొండని బాలకిషన్, వైద్యాధికారి గీతాంజలి, నాయకులు పాల్గొన్నారు.

**కోనరావుపేట:** మండలం గొల్లపల్లి(వట్టిమల్ల)లో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సర్పంచ్ గోపు పర్శరాములు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బండ రవి, కార్యదర్శి కరుణాకర్, ఏఎన్ఎంలు తిరుమల, జ్యోతి పాల్గొన్నారు.

### అర్బన్ బ్యాంకు చైర్మన్‌ను తొలగించాలి

**సిరిసిల్లటౌన్:** నిబంధనలు అతిక్రమించి ఎన్నికైన సిరిసిల్ల అర్బన్ బ్యాంకు చైర్మన్ గాజుల నారాయణను వెంటనే విధుల నుంచి తొలగించాలని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ కమిషనర్ అండ్ రిజిస్ట్రార్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ముగ్గురు పిల్లలకు కలిగి ఉన్న విషయం గోప్యంగా ఉంచి డైరెక్టర్‌గా ఎన్నికై చైర్మన్ పదవి పొందినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై అధికారికంగా విచారణ పూర్తయి, చైర్మన్ ముగ్గురు పిల్లలు కలిగి ఉన్నట్లు రిపోర్టు అందించారని వెంటనే ఆయనను తొలగించాలని కోరారు. తదుపరి అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సమితి ప్రతినిధులు చిప్ప దేవదాసు, దొంతుల ప్రకాశ్ పాల్గొన్నారు.

### కేటీఆర్ హామీ నిలబెట్టుకోవాలి

**సిరిసిల్లటౌన్:** జిల్లాలో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వ సాయం అందిస్తామన్న మంత్రి కేటీఆర్ హామీని వెంటనే నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. బుధవారం సిరిసిల్ల కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్లో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 20 వేల ఎకరాల్లో పంట నష్టం జరుగగా మంత్రి కేటీఆర్ సాయం చేస్తామని చెప్పి పది రోజులు గడిచిందన్నారు. డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు కడారి రాములు, మంచికట్ల రమేశ్, సోమ నాగరాజు పాల్గొన్నారు.

### కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభం

**బోయినపల్లి:** మండలంలోని కోరెం, బూర్గుపల్లి గ్రామాల్లో కుట్టు శిక్షణ కేంద్రాలను జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, కోరెం గ్రామ సర్పంచ్ చెన్నాడి రాజ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఏసీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్ నిర్మల, మాజీ ఎంపీపీ సత్తినేని భాగ్యలత, కోరెం ఎంపీటీసీ మమత, ఉపసర్పంచ్ రోహిణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాల ప్రచారం



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న ప్రిన్సిపాల్

**చందుర్తి:** విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని చందుర్తి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశ్, లెక్చరర్లు ఇంటింట ప్రచారం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పదో తరగతి పాసైనా విద్యార్థుల ఇళ్లకు వెళ్లిన ప్రభుత్వ కళాశాలల్లో ప్రభుత్వం కల్పించే సదుపాయాలను వివరిస్తున్నారు. కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలు ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. అనుభవం, అర్హత కలిగిన అధ్యాపకులతో విద్యా బోధన అందిస్తున్నామని, అలాగే విద్యార్థులకు ఉచిత ప్రవేశాలతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, స్టడీమెటరియల్ అందిస్తున్నట్లు తెలుపుతున్నారు. అర్హత కలిగిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ కూడా వచ్చే అవకాశాలున్నాయని పేర్కొంటున్నారు. కార్యక్రమంలో లెక్చరర్లతో పాటు మల్యాల గ్రామ సర్పంచ్ గట్టు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారి

**సిరిసిల్లఅర్బన్:** సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేటలోని జిల్లా రైతు వేదికలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కౌన్సిలర్ పోచవేణి సత్య, రైతు బంధు మండలాధ్యక్షుడు అగ్గి రాములు హాజరై మాట్లాడారు. రైతులు వరికి బదులు అధిక దిగుబడి ఇచ్చే అయిల్ పామ్ పంటలను సాగు చేయాలన్నారు. ఈ సాగుకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ అందజేస్తుదని, దీనివల్ల రైతులు దీర్ఘకాలిక ఆదాయాన్ని పొందవచ్చాన్నారు. ఆయిల్ సామ్ సాగు విధానం, తదితర అంశాల గురించి రైతులకు వివరించారు. అనంతరం ఆయిల్ పామ్ సాగుచేస్తున్న రైతులను సన్మానించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనూష, ఉద్యానవన శాఖ అధికారి స్రవంతి, ఏఈవో సుచరిత, రైతులు పాల్గొన్నారు.

**అధికారులను నిలదీసిన రైతులు**

**వేములవాడరూరల్:** వేములవాడ మండలంలోని నాగాయపల్లి రైతు వేదికలో బుధవారం ఆయిల్ పంటలపై రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ క్లస్టర్ పరిధిలోని నాగాయపల్లి, మర్రిపల్లి, చెక్కపల్లి, ఎదురుగట్ల గ్రామాల రైతులు పాల్గొన్నారు. అయితే వర్షాల వల్ల వరి పంట దెబ్బతింటే కనీసం అధికారులు రాలేదని, దీంతో మరింత నష్టం జరిగినట్లు నాగాయపల్లికి చెందిన రైతులు పర్శరాం, లచ్చయ్య, బాలయ్య అధికారులను నిలదీశారు. పంట నష్టం జరిగిన తరువాత అంచనా వేసిన అధికారులు పది రోజుల వరకు కూడా సంఘటన స్థలానికి రాలేదని వారు అన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి గోవర్ధన్, ఏవో సాయికిరణ్, సర్పంచ్ టంపుల సుమన్, ఏఈవో అనూష, క్లస్టర్ అధికారి సాయివివేక్, రైతులు పాల్గొన్నారు.

**ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు**

**వీర్నపల్లి:** మండలంలోని రైతు వేదికలో ఆయిల్ పామ్ పంటల సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు భూలపాల్గొని మాట్లాడారు. అనంతరం ఆయిల్ పామ్ సాగు చేసే రైతులను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుగులోతు కళ, మండల రైతుబంధు అధ్యక్షుడు సాగర్, గ్రామ అధ్యక్షుడు శేఖర్, రాములు, సర్పంచ్ దినకర్, ఉపసర్పంచ్ రవి, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఎంపీడీవో నరేశ్, ఏఈవో శ్రీధర్ రెడ్డి, క్లస్టర్ అధికారి అరవింద్ పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

**బోయినపల్లి:** క్రీడలు గ్రామాల మధ్య స్నేహభావం పెంపొందిస్తాయని ఎంపీపీ వర్లపల్లి వేణుగోపాల్ అన్నారు. బుధవారం స్థానిక హైస్కూల్ మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు ముగింపు సభ నిర్వహించారు. కబడ్డీలో కొదురుపాక, మర్లపేట, వాలీబాల్‌లో బోయినపల్లి, జగ్గారావుపల్లి, ఖోఖోలో బోయినపల్లి, బూర్గుపల్లి, జట్లు ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించాయి. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దర్పెల్లి నరేశ్, ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, ఎంపీవో ఏ. గంగాతిలక్, వైస్ఎంపీపీ నాగయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, లక్ష్మీరాజం, పీడీ సంపత్‌రావు, పీఈటీ బోయిని సంతోష్ పాల్గొన్నారు.

**తంగళ్లపల్లి:** మండలంలో బుధవారం సీఎం కప్ క్రీడల్లో విజేతలకు ఎంపీపీ పడిగెల మానస ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంపీడీవో పి.లచ్చాలు పాల్గొన్నారు.

**రుద్రంగి:** స్థానిక తెలంగాణ క్రీడా ప్రాగణం, జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

**వేములవాడరూరల్:** సీఎం కప్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు మండలంలోని చెక్కపల్లి గ్రామంలో బుధవారం మెమోంటోలతో పాటు సర్టిఫికేట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు బుధవారం అందజేశారు. ఎంపీపీ బండ మల్లేశం, సర్పంచ్ ఏశ తిరుపతి పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డిపేట:** స్థానిక క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన పోటీలు బుధవారం ముగిశాయి. విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీడీఓ చిరంజీవి, తహసీల్దార్ జయంత్‌కుమార్, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.